క్లుప్తంగా

బాణసంచా ముడి సామగ్రి పట్టివేత

కపిలేశ్వరపురం (మండపేట): రావులపేటలోని ఓ ఇంటిలో లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బాణసంచా తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేశారు. ఘటనా స్థలంలో రూ.5 లక్షల విలువ గల మందుగుండు ముడి సరకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2,500 కేజీల మతాబులు, చిచ్చుబుడ్ల తయారీకి వినియోగించే రసాయన మిశ్రమాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: కుయ్యేరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కాజులూరుకు కొత్త లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. కుయ్యేరు, ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు, చింతలలంక, రేగుబడవ, పల్లిపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.

కె.గంగవరం: పామర్రు సబ్ సేషన్ వద్ద శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పామర్రు, యండగండి, అముజూరు, కూళ్ల, పాణింగపల్లి, కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు, మాచర గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రిలే దీక్షకు సంఘీభావం

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సంఘానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన వివిధ రకాల బకాయిలను వెంటనే చెల్లించాలంటూ సంఘం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. గురు, శుక్రవారాల్లో పలు చేనేత సంఘాల నాయకులు, ఇతర రంగాల ప్రజాసంఘాల నాయకులు దీక్ష చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. జాతీయ బీసీ సమైక్య సంక్షేమ సంఘం జాతీయ కమిటీ అధ్యక్షుడు తులసిగిరి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. గంగారామ్, ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు.

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం

కపిలేశ్వరపురం: గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో గ్రామ సమస్యలను పరిష్కరించునున్నట్టు ఎంపీడీఓ హెచ్. బానూజీ అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని 19 గ్రామ సభలను నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన సభల్లో కార్యదర్శులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పంచాయతీ కార్మికులను సత్కరించారు. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో కార్యదర్శులు ఆధ్వర్యంలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. ఎంపీడీఓ సత్యనారాయణ, ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అదనపు గదుల భవనం ప్రారంభం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆవరణలో మెండు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెండు సాయి ఈశ్వర స్వామి తన తండ్రి మెండు శఠ గోపాల రామానుజ స్వామి జ్ఞాపకార్థం రూ.19 లక్షలతో నిర్మించిన అదనపు గదుల భవనాన్ని గురువారం సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సంకురాత్రి చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సుమారు రూ. 2 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను ట్రస్ట్ తరపున పీహెచ్‌సీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ అంబటి భవాని, సభ్యురాలు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సత్యనారాయణ, వైద్యులు డాక్టర్ ఎస్. ప్రశాంతి, డాక్టర్ సందీప్‌నాయుడు, డివిజనల్ మెడికల్ సూపర్‌వైజర్ జి. కమల్ శేషు, మెండు చక్రపాణి పాల్గొన్నారు.

రిక్షా స్టాండ్ తొలగిస్తే ఆందోళన

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఉన్న రిక్షా స్టాండ్‌ను తొలగించేది లేదంటూ తమకు మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిని రిక్షా కార్మికులు కోరారు. సంఘం నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో ఆమెకు సమస్యను వివరించారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ అధికారులు రిక్షా స్టాండ్ బోర్డును తొలగించారని, స్టాండ్ విస్తీర్ణం కొలతలు తీసుకోవడంతో ఆందోళన చెందుతున్నామని తెలిపారు. స్టాండ్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించుకుంటే ఆందోళనకు దిగుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ధూళి జయరాజు, మున్సిపల్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రగుంట అయ్యప్ప, రిక్షా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఊక లారీలతో రాకపోకలకు అంతరాయం

- రహదారుల నిర్బంధం
- నిబంధనలకు విరుద్ధంగా భారీ లోడుతో ప్రయాణం
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులు, వాహనదారులకు ఇక్కట్లు



గొల్లపాలెం-యానాం రహదారిపై ఊక లారీ

కాజులూరు: రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఊకలోడుతో యథేచ్ఛగా తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు ప్రయాణికుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన ఊక లోడుతో భారీ వాహనాల రోడ్డుపై వెళుతుంటే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డుపై విద్యుత్ తీగలు, స్తంభాలకు భారీ వాహనాలు తగిలి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రయాణికులు, వాహనదారుల కళ్లల్లో ఊక పడితే వారి బాధ వర్ణనాతీతం.

నిత్యకృత్యంగా..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిలో ఊక లోడు వాహనాల రాకపోకలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. గతంలో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ఈ ఊక లారీలు, ట్రాక్టర్లు ఇటీవల పగటివేళలోనూ యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాహనాల రాకపోకలు రద్దీగా ఉండే సమయాల్లోనూ ఊకవాహనాలు తిరగడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. మండలంలోని కాజులూరు, దుగ్గుదుర్రు, జగన్నాథగిరి, ద్రాక్షారామ పరిసర గ్రామాల్లోని రైసుమిల్లుల నుంచి ఇటుక బట్టీలకు ఊక, బూడిద రవాణా చేస్తుంటారు. లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా బరకాలు కట్టి ఊక, కాలిన బుడిద లోడు చేయడం వలన వాహనం సైజు భారీగా పెరిగి రోడ్డును ఆక్రమిస్తూ ప్రయాణిస్తున్నాయి. దీని వలన ఎదురుగా వచ్చువాహనాలు కనిపించక తప్పించక ముందుకు వెళ్లేందుకు వీలులేకుండా పోతోందని ప్రయాణికులు చెబుతున్నారు. వాహనాలు వేగంగా వెళ్లే సమయాల్లో ఊక, బుడిద ఎగిరి వచ్చి వెనుక వచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వాహనాలు రోడ్డుపై ప్రయానించే సమయంలో పైన విద్యుత్ తీగలకు తగిలి మంటలు సంభవించడం, లేదా ఈ వాహనాలు మలుపు తిరగలేక విద్యుత్ స్తంభాలను ఢీకొనటం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి.

చర్యలు శూన్యం

కాజులూరులో కొన్ని రోజుల క్రితం రోడ్డుపై వెళ్లుతున్న ఊక ట్రాక్టరుకు పైన విద్యుత్ తీగలు తగులుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఇటీవల కోలంకలో యానాం, ద్వారపూడి రహదారిపై ఊక ట్రాక్టరు సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి ముక్కలై నేలపై పడింది. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో రోడ్డుపై వెళ్లుతున్న ప్రయాణికులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అధికారుల కళ్లముందే నిబంధనలకు విరుద్ధంగా భారీ లోడుతో వాహనాలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారులను ఆక్రమించుకుంటూ..



లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా బరకాలు కట్టి ఊక, కాలిన బుడిద లోడు చేస్తున్నారు. వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తూ ప్రయాణిస్తున్నాయి. ఇవి ముందు వెళుతుంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తప్పించుకుని ముందుకు వెళుతున్నప్పుడు ప్రమాదాల పాలవుతున్నాం.

– రాయుడు నూకరాజు, గొల్లపాలెం

కళ్లల్లో పడితే నరకమే..



భారీ లోడు వాహనాలు రోడ్లపై వేగంగా వెళ్లే సమయాల్లో వాటిలోని ఊక, బుడిద ఎగిరి వచ్చి వెనుక వచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చవిచూస్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు.

– నల్లమిల్లి శ్రీవిష్ణురెడ్డి, మొగలిపాలెం

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన




కార్యక్రమంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 26వ వార్డు గాంధీ నగర్‌లోని కాపు రామాలయం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వేర్వేరుగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, ముక్కా దాలయ్య, తణుకు అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ అందజేత

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల పంచాయతీ శివారు నరజాడ గ్రామానికి దాతలు శుక్రవారం ప్రింటర్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన చొడి చినకొండ రూ. 5 వేలు ఆర్థిక సాయం చేయగా గ్రామానికి చెందిన పలువురు దాతల ఆర్థిక సాయంతో రూ.12 వేలు విలువ చేసే ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. ఈ ప్రింటర్‌ను గ్రామ నాయకులు, అముజూరు సొసైటీ అధ్యక్షుడు పెంకే గోవిందరాజు, పూర్వ విద్యార్థులు ప్రారంభించారు. పెద్దలు కోడి శ్రీను, హెచ్‌ఎం ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఏనుగుల సంబరం





ద్రాక్షారామలో విద్యుత్ దీపాలంకరణతో ఏనుగుల వాహనాలు

రామచంద్రపురం రూరల్: ఏటా దసరా పండుగను పురస్కరించుకుని ద్రాక్షారామలో నిర్వహించే ఏనుగుల సంబరం, గురు, శుక్రవారాల్లో కన్నుల పండువగా నిర్వహించారు. కర్రి వారి వీధి, సాక్షివారి వీధి, వెలంపాలెం బుర్రా వీధుల్లో భారీ బొమ్మ ఏనుగులకు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించి బ్యాండు మేళాలు, కర్రసాములు, బొమ్మల వేషాలు, తీన్‌మార్ డాన్సులతో తెల్లవారే వరకు ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో ఊరేగింపు కొనసాగింది. ఏనుగుల సంబరంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్ (బాబీ), ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సంబరం

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డులోని కనకదుర్గమ్మవారికి ఏనుగుల సంబరాన్ని ఆలయ కమిటీ ఎంతో వైభవంగా నిర్వహించారు. 49 ఏళ్లుగా దసరా మహోత్సవాన్ని భక్తులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ విద్యుద్దీపాలంకరణ, భారీ అన్నదాన కార్యక్రమాలు నిత్య పూజలు దసరా ఉత్సవాల సందర్భంగా 9 రోజులుగా ఘనంగా నిర్వహించారు. సుమారు 1970 ప్రాంతంలో కాలువలో లభ్యమైన అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తున్నారు.

సందడిగా ఏనుగుల సంబరం

విజయదశమి మరుసటి రోజున కొత్తూరు రోడ్డులోని ఆలయం కమిటీ ఆధ్వర్యంలో కనకదుర్గ వారిని ఏనుగు వాహనంపై ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. విద్యుత్ దీపాలతో కూడిన ఏనుగు ఆకారంలో ఏర్పాటు చేసిన బొమ్మపై అమ్మవారిని ఊరేగించారు. ఈ సంబరాన్ని చూసేందుకు పట్టణంతో పాటుగా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



గొల్లపాలెంలో ఏనుగు ఊరేగింపు

కోలాహలంగా ఏనుగుల సంబరం

కాజులూరు: ఏనుగు సంబరం గొల్లపాలెంలో వైభవంగా నిర్వహించారు. గ్రామంలో సుమారు 200 ఏళ్ల నుంచి విజయదశమిని పురస్కరించుకుని ఏటా ఎండుగడ్డి, తెల్లని వస్త్రం తదితర వస్తు సామగ్రితో తయారు చేసిన భారీ ఏనుగుల ప్రతిమలను ఊరేగిస్తారు. గురువారం మధ్యాహ్నం రాత్రి వరకూ చిన్న ఏనుగును గ్రామస్తులు జేజేలు పలుకుతూ ఊరేగించారు. పెద్ద ఏనుగును గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ ట్రాక్టరుపై ఊరేగించారు. బేతాళ స్వామి రూపంలో భక్తులు ఏనుగుల ప్రతిమలకు పూజలు నిర్వహించారు. గరగనృత్యాలు, కోలాటం, కోయ నృత్యాలు, గారడీ, బ్యాండ్ మేళాలతో ఏనుగు సంబరం కోలాహలంగా సాగింది. నియోజకవర్గ గ్రామాలతోపాటు కాకినాడ పట్టణ, రూరల్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం ఏనుగుల సంబరాన్ని వీక్షించేందుకు తరలివచ్చారు. గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలతో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

డ్రెయినేజీ నిర్మాణాలకు భూమిపూజ

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో శుక్రవారం ఎంపీ నిధులు రూ. 15 లక్షలతో చేపట్టనున్న డ్రెయినేజీ పనులకు శుక్రవారం స్థానిక వార్డు సభ్యురాలు పిల్లి సుహాసిని, శ్రీనివాసరావు దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, సాక్షి పద్మనాభం, నున్న కల్యాణ్, కొసనా భీమశంకరం, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి రవీంద్ర, గౌస్, నున్న చిన్నా, కొర్ల బాబీ పాల్గొన్నారు. పంచాయతీ నిధులతో ద్రాక్షారామలోని ఆని కృష్ణ ఇంటి వద్ద డ్రెయిన్ నిర్మాణ పనులను సర్పంచ్ అరుణ, వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, వార్డు సభ్యుడు యండమూరి ఈశ్వరరావు ప్రారంభించారు.

కె.గంగవరం: భట్లపాలిక శివారు రావిదొడ్డిపేటలో శుక్రవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సుమారు రూ.15 లక్షల నిధులు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంజూరు చేశారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుడు, రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ యలమంచిలి సత్యవతి, ఎంపీటీసీ బాలు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి రమణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరాల శ్రీను, నాయకులు బొక్కా భానుమూర్తి, పంపన సుబ్బారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బోస్, కో-ఆర్డినేటర్ సూర్యప్రకాష్

గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందన్న జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను నాయకులు ఆదర్శంగా తీసుకుని పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని వైఎస్సార్ సీపీ నేత, వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ అన్నారు. గురువారం మండల గ్రామాల్లో నాయకులు మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె.రాంబాబు, అయితపూడిలో వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, కుయ్యేరులో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పుమిల్లిలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరద శేషారావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో భాగంగా పలు గ్రామాల్లో బీజేపీ నేతలు స్వచ్ఛభారత్ నిర్వహించి పరిశరాలను శుభ్రం చేసారు.



కాజులూరులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు

అంబరాన్నంటిన దసరా సంబరం

- ఘనంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనం
- మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో సందడి
- వైభవంగా ముగిసిన ఉత్సవాలు



మండపేట గాంధీ నగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కాజులూరు: శరన్నరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. గత నెల 22వ తేదీ సోమవారం వాడవాడలా దసరా ఉత్సవాలను ప్రారంభించారు. కాజులూరు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ నిర్వాహక కమిటీ సభ్యులు శుక్రవారం ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. గరగ నృత్యాలు, పగటి వేషాలు, బాజాభజంత్రీలతో అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీపంలోని కాలువల్లో నిజమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

శరన్నవరాత్ర మండపాల్లో సందడి

కపిలేశ్వరపురం: దసరా సంబరాలు అంబురాన్నంటాయి. మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాలు, మండపేట పట్టణంలోని 30 వార్డుల్లోని శరన్నవరాత్ర శిబిరాలు సందడిగా మారాయి. గురు, శుక్రవారాల్లో అమ్మవారి విగ్రహాలు నిమజ్జనం, అన్న సమారాధన తదితర కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, టేకి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మండపేట నియోజకవర్గంలోని పలు శిబిరాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూజలు చేశారు. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ దసరా సంబరాల్లో పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు కురుపూడి భవాని, పుట్టపూడి అబ్బు, ఎంపీపీ నౌండు వెంకటరమణ, మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ మండల కమిటీల అధ్యక్షులు అడబాల బాబ్జి, గూటం సత్యనారాయణ, వెలగల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

జయహో.. దుర్గాభవానీ

రాయవరం: శరన్నవరాత్ర ఉత్సవాలు శుక్రవారం విజయదశమి పర్వదినంతో ఘనంగా ముగిసాయి. మండలంలోని రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా గురువారం నూతన వాహనాలు కొనుగోలు చేసిన వారు ఆలయాల వద్ద వాహన పూజలు, కార్మికులు ఆయుధ పూజలు చేశారు. పలువురు భక్తులు తమ కోర్కెలను, శమీ మంత్రాన్ని చీటీలపై రాసి జమ్మిచెట్టుకు కట్టి పూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో అలంకరించారు. దసరా ఉత్సవాలు ముగియడంతో ఆలయాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు

రాయవరం: మంచి ఆలోచనలతో ప్రతి ఒక్కరూ సమాజహితానికి పాటు పడాలని, ఇదే విషయాన్ని విజయదశమి పర్వదినం లోకానికి చాటి చెబుతుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆయన పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. విజయదుర్గా అమ్మవారు విజయదశమి రోజు భక్తులకు రాజరాజేశ్వరి రూపంలో దర్శనమిచ్చారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా రథోత్సవం

శరన్నవరాత్రి ముగింపును పురస్కరించుకుని పీఠంలోని విజయదుర్గా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై, శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వర స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పీఠంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తిని రథంపై, స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతురావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పీఠంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

భవానీల ఊరేగింపు

రాయవరం: విజయదశమి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని రాయవరంలో శుక్రవారం భవానీ భక్తులు ఊరేగింపు నిర్వహించారు. భవానీ మాల ధరించిన భక్తులంతా అమ్మవారి విగ్రహాన్ని వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.



సోమేశ్వరంలో ప్రత్యేకాలంకరణలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి



ప్రత్యేకాలంకరణలో విజయదుర్గ అమ్మవారు



కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద నిమజ్జనానికి అమ్మవారి ప్రతిమను తరలిస్తున్న భక్తులు



అంగరలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



కాజులూరులో అమ్మవారి ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన



రాయవరంలో భవానీ భక్తుల ఊరేగింపు